

ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో చాలామంది బాలలు కార్మికులుగా మారుతున్నారు. పేదరికం కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనంలోనే చదువు మాన్పించి పనుల్లో పెడుతున్నారు. ఏ ఆదరణకూ నోచుకోని కొంతమంది అనాథలు బుక్కెడు బువ్వ కోసం పసిప్రాయంలోనే రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. మరికొందరు ఇళ్ల నుంచి పారిపోయి, తప్పిపోయి విధి వంచితులుగా మారుతున్నారు. కారణాలేమైనా మరపురాని బాల్యం పని స్థలాల్లో నలిగిపోతోంది. ఫలితంగా వారి బంగారు భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోంది. ఇలాంటి వారికి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

బాల కార్మికులకు విముక్తి!

ఈ నెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్



- బాల కార్మికులను గుర్తించేందుకు రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 11టీమ్‌ల ఏర్పాటు
- జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకు 69 మంది పిల్లలకు వెట్టి నుంచి విముక్తి, 39 కేసులు నమోదు

పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 13: బాలకార్మికులుగా మారిన చిన్నారులకు విముక్తి కల్పించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూన్‌లో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల ఒకటో తేదీన ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమైంది. వివిధ శాఖల సమన్వయంతో ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. హోటళ్లు, షాపులు, మెకానిక్ షెడ్లు, ఇతర ప్రదేశాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను ఈ స్పెషల్ టీమ్‌లు గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి.

వివిధ శాఖల సమన్వయంతో..

పోలీసుశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ డిపార్ట్మెంట్ల అధికారులు, సిబ్బందితో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే పోలీస్ సబ్ డివి జన్ల వారీగా ప్రోగ్రాం ఇన్‌చార్జిలుగా ఎస్ఐ స్థాయి అధికారులను నియమించారు. వీరు తమ పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, షాపులు, పండ్ల దుకాణాలు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు, ఇతర ప్రదేశాల్లో తిరుగుతూ బాల కార్మికులను గుర్తిస్తారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తారు. ఇప్పటికే సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్ల నేతృత్వంలో ఆపరేషన్ ముస్కాన్ విధి విధానాలపై సంబంధిత అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లో వెట్టి నుంచి విముక్తి పొందిన బాలకార్మికుల వివరాలు సంవత్సరం	ఆపరేషన్ స్మైల్ (జనవరి)	నమోదైన కేసులు	ఆపరేషన్ ముస్కాన్ (జూలై)	నమోదైన కేసులు
2021	142	58	294	82
2022	259	36	329	59
2023	324	83	414	104
2024	203	155	69	39

ప్రత్యేక నిఘా..

ఈ నెల 31వ తేదీ వరకు చేపట్టే ఆపరేషన్ ముస్కాన్ ప్రోగ్రాంలో బాల కార్మికులను గుర్తించడంతో గతంలో నమోదైన కేసుల డేటా ఆధారంగా పిల్లలు పనిచేస్తున్న హాట్‌స్పాట్‌పై నిఘా పెట్టారు. గతంలో రెస్క్యూ చేసిన పిల్లల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుంటారు. డ్రాపవుట్ పిల్లలను గుర్తించి వారిని తిరిగి స్కూళ్లు, కాలేజీల్లో చేర్పిస్తారు, ఆరోగ్యం బాగాలేని వారిని ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తారు. 'మా వద్ద బాల కార్మికులు లేరు' అనే బోర్డులను షాపుల వద్ద ఏర్పాటు చేయిస్తారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తారు. గొర్రెలు, మేకల, పశువుల కాపరులుగా పనిచేస్తున్న వారిని, రోడ్లపై భిక్షాటన చేసేవారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగిస్తారు. పిల్లలకు ఎవరూ లేకపోతే ప్రభుత్వం నిర్వహించే స్టేట్‌హోమ్‌కు పంపుతారు.

స్పెషల్ టీమ్‌ల ఏర్పాటు

జిల్లాలోని రాచకొండ, సైబరాబాద్ పరిధిలో 11 స్పెషల్ టీమ్‌లు జిల్లాలో పర్యటిస్తూ బాలకార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తున్నారు. 14 ఏళ్ల పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం లేదా స్టేట్‌హోంకు తరలించి స్కూళ్లు, కాలేజీల్లో చేర్పిస్తున్నారు. తల్లిదండ్రుల దగ్గరికి చేర్చడం, అయినవాళ్లు లేకపోతే స్టేట్‌హోంకు తరలించి స్కూళ్లు, కాలేజీల్లో చేర్పిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 68 మంది పిల్లలకు విముక్తి కల్పించారు. 39 కేసులను నమోదు చేశారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్పందించాలి. పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ప్రతీ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎస్ఐ, నలుగురు సిబ్బందితో టీములను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఆఫీసర్లకు సమాచారం అందించాలి. 100 డయల్ లేదా 1098 నంబర్ డయల్ చేయండి. లేదా లోకల్ పోలీసులకు కూడా సమాచారం ఇవ్వొచ్చు. అందరం కలిసి బాలలకు బంగారు భవిష్యత్‌ను కానుకగా ఇవ్వాలి. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సహకరించాలి.



- పద్మజ రమణ, జిల్లా శిశుసంక్షేమాధికారి

దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీలపై కసరత్తు

- ఇప్పటికే అధికారులు, సిబ్బంది, అర్చకుల వివరాల సేకరణ
- రెండు, మూడు రోజుల్లో ట్రాన్స్‌ఫర్లపై రానున్న స్పష్టత
- ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 630 ఆలయాలు
- విధుల్లో 230 మంది వరకు ఉద్యోగులు, అర్చకులు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/రంగారెడ్డి అర్బన్, జూలై 13 : దేవాదాయ, ధర్మాదాయ శాఖలో బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతించడంతో దేవాదాయ శాఖలోనూ ఉద్యోగుల బదిలీలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు. దేవాదాయ శాఖలో దేవాలయాలు, కార్యాలయాల్లో నాలుగేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసేందుకు సంబంధితశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులతో పాటు అర్చకులను కూడా బదిలీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల పరిధిలోకి వచ్చే అధికారులు, ఉద్యోగులు, అర్చకుల వివరాలను ఇప్పటికే ఆ శాఖ అధికారులు సేకరించారు. కిందిస్థాయి నుంచి వచ్చిన సమాచారంతో తమ వద్ద ఉన్న వివరాలను సరి చూసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 630 దేవాలయాలు ఉండగా, 230 మంది వరకు ఉద్యోగులు, అర్చకులు పనిచేస్తున్నట్లు సమాచారం. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా పరిధిలో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు వస్తాయి. ఈ దేవాలయాల్లో 6ఏ విభాగంలో 19ఉండగా, 6బీ కింద 41, 6సిలో 570 దేవాలయాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ దేవాలయాల్లో ధూపదీప నైవేద్య పథకం కింద ఎంపిక చేసిన దేవాలయాలు కూడా కొన్ని ఉన్నాయి.



తప్పనిసరి బదిలీలకే అవకాశం

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం దేవాదాయ, ధర్మాదాయ శాఖలో తప్పనిసరిగా బదిలీలు జరిగే వారితో పాటు బదిలీలు కోరుకున్న ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. తప్పనిసరిగా బదిలీలు జరిగే వారిలో, బదిలీలుకోరుకునే ఈవోలు, మేనేజర్లు, ఉద్యోగులు ఉండగా, ఈసారి కొత్తగా అర్చకుల వివరాలు కూడా సేకరించడం చర్చనీయాంశంగా మారింది. ఈసారి బదిలీల్లో దేవాదాయ శాఖలో పనిచేసే మొత్తం ఉద్యోగుల్లో 40శాతం మందికి మాత్రమే స్థాన చలనం జరగనుంది. చాలా కాలంగా ఒకే చోట కొనసాగుతున్న ఉద్యోగులు, అర్చకులు బదిలీ అయ్యే అవకాశం ఉండగా, ఉమ్మడి జిల్లా పరిధిలో 80 నుంచి 95 మంది వరకు ఉద్యోగులు బదిలీ కావచ్చని తెలుస్తోంది. ఒకే దేవాలయంలో నాలుగేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని బదిలీల జాబితాలో చేర్చినట్లు సమాచారం.

చర్చనీయాంశంగా మారిన అర్చకుల బదిలీలు?

దేవాలయాల్లో అర్చకుల నియామకం జరిగినప్పటి నుంచి చాలా వరకు వారు ఒకే చోట కొనసాగుతున్నారు. సాధారణంగా అర్చకులు ఏ దేవాలయంలో అర్చక సేవలు అందిస్తూ ఉంటే ఆ దేవాలయంలోనే వారిని ఇంత వరకుకొనసాగిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈసారి దేవాదాయ శాఖ కార్యాలయాలతో పాటు దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల వివరాలు కూడా సేకరించడం ఆ శాఖలో చర్చకు దారితీసింది. ఒక్కో దేవాలయంలో ఒక్కో ఆగమ శాస్త్రం ప్రకారం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒకదేవాలయంలో ఓ ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించే అర్చకుడు మరోఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించే మరో దేవాలయానికి బదిలీ చేస్తే ఎలా అన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఓదేవాలయంలో అర్చక సేవలు అందిస్తున్న అర్చకులను మరో దేవాలయానికి బదిలీ చేసే అంశాన్ని విరమించుకోవాలన్న డిమాండ్ అర్చకుల నుంచి వ్యక్తమవుతోంది.

ఫ్రీ బస్సులో కూరగాయల గిరాకీ

- నాయినోనిపల్లికి చెందిన ఓ మహిళా రైతు అమ్మకం
- సోషల్ మీడియాలో వైరల్

పరిగి, జూలై 13 : మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఫ్రీ బస్సు సౌకర్యం అనేక విధాలుగా ఉపయోగపడుతోంది. అయితే కూరగాయాలు విక్రయించే మహిళా రైతులు బస్సు ప్రయాణాన్ని తమ అమ్మకాల కోసం కూడా ఉపయోగించుకుంటున్నారు. మూడు రోజులు క్రితం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతులు మహబూబ్‌నగర్‌లో కూరగాయలను విక్రయించారు. మిగిలిన కూరగాయలతో వారు రాత్రి 8:30గంటల ప్రాంతంలో తిరిగి మహబూబ్‌నగర్ నుంచి పరిగి వెళ్లే బస్సులో ఇంటికి బయలుదేరారు. బస్సులో వారితో పాటే ప్రయాణిస్తున్న ఓమహిళ మిగిలిన కూరగాయలను చూసి తనకు కావాలని మహిళా రైతు మణెమ్మను కోరగా ఆమెకు బెండకాయలు అమ్మింది. సదరు మహిళ వెంట కూరగాయల గంప తెచ్చుకుని బస్ఎక్కిన ప్రయాణికులకు తూకం వేస్తూ విక్రయించింది. ఆ దృశ్యాన్ని బస్సు కండక్టర్, మరికొందరు ప్రయాణికులు వీడియోల్లో బంధించారు. ఆ వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


బస్సులో కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతు మణెమ్మ

హత్య చేయించింది కొడుకే..

- రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసులో నిందితుల అరెస్ట్
- తండ్రి హత్యకు సుపారి ఇచ్చిన కుమారుడు
- హంతకులకు రూ.25లక్షలు, ఇల్లు ఇచ్చేందుకు ఒప్పందం
- శంషాబాద్ డీసీపీ రాజేష్ వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్

షాద్‌నగర్ రూరల్, జూలై 13: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కమ్మదనం శివారులోని కేకే ఫాంహౌజ్‌లో ఈ నెల 10న జరిగిన రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కృష్ణ కొడుకే సుపారి ఇచ్చి అతడిని హత్య చేయించినట్టు పోలీసులు నిర్ధారించారు. కేసు వివరాల్లోకి వెళ్తే.. కమ్మరి కృష్ణకు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు గార్డెన్స్, బండ్లగూడలో కేకే కన్వెన్షన్స్ ఉన్నాయి. కమ్మదనం శివారులో సాగు భూమి కొని ఫామ్‌హౌజ్ నిర్మించుకున్నాడు. మొదటి భార్య ఉండగానే రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె చనిపోవడంతో పావని అనే మహిళను మూడో పెళ్లి చేసుకున్నాడు. పావనికి 13నెలల పాప ఉంది. కాగా కృష్ణ తమను పట్టించుకోవడం లేదని మొదటి భార్య పిల్లలు ఆగ్రహంగా ఉన్నారు. అలాగే మూడో భార్య పేరట ఇటీవల రూ.16కోట్ల విలువ చేసే భవనం, కేకే గార్డెన్ భవనం రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం తెలిసిన మొదటిభార్య కుమారుడు కమ్మరి శివ(35).. తండ్రిని ఇలాగే వదిలేస్తే మిగతా ఆస్తులన్నీ మూడో భార్య పేరిట చేస్తాడని, తండ్రిని అంతమొందించాలని పథకం వేశాడు. ఇందుకు గతంలో తన తండ్రికి అంగరక్షకుడిగా పనిచేసి మానేసిన బాబ అలియాస్ శివానంద్‌కు సుపారి ఇచ్చాడు. రూ.25లక్షలు, ఇల్లు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. దాంతో బాబ పీరమ్ చెరువుకు చెందిన జీలకర్ర గణేష్ అలియాస్ లడ్డూ అలియాస్ అజయ్, మరో 17ఏళ్ల మైనర్‌లతో కలిసి కృష్ణ హత్యకు ప్లాన్ చేశారు. 15రోజుల క్రితం కృష్ణ వద్దకు బాబ వచ్చి నమ్మకంగా ఉంటానని మాయ మాటలు చెప్పి పనిలో చేరాడు. ఈ నెల 10న కృష్ణ, భార్య పావని, కూతురు కలిసి కమ్మదనం ఫామ్‌హౌజ్‌కు వచ్చారు. సాయంత్రం 5:30గంటల సమయంలో బాబ గట్టిగా అరవడంతో అప్పటికే బయట ఉన్న ఇద్దరు లోపలికొచ్చి కృష్ణ చేతులను వెనక్కి విరిచి పట్టుకున్నారు. బాబ కత్తితో కృష్ణ గొంతు కోసి, పొట్టలో పొడిచి చంపి పారిపోయారు. పావని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు, నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారి నుంచి రెండు కార్లు, ఒక బైక్, మూడు కత్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి పర్యవేక్షణలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సైలు వరప్రసాద్, శరత్, శ్రీకాంత్, సిబ్బంది దర్యాప్తులో పాలుపంచుకొని కేసును ఛేదించామని తెలిపారు.

డేంజర్ స్పాట్!

ప్రమాదాలకు కేంద్రంగా కొత్తూర్ వై జంక్షన్

- తరచూ ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా అండర్‌పాస్
- ట్రాఫిక్ స్తంభనతో ప్రజలు బెంబేలు


వై జంక్షన్‌లో జరిగిన ప్రమాదం (ఫైల్)

కొత్తూర్: జూలై 13: కొత్తూర్ వై జంక్షన్ డేంజర్ స్పాట్‌గా మారింది. అమాయకుల ప్రాణాలు మింగేస్తోంది. ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఏమైతుందో తెలియని పరిస్థితి. ట్రాఫిక్ స్తంభించి వాహనచోదకులను గడగడలాడిస్తున్న ఈ జంక్షన్‌లో ప్రాణాలను ఆరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. అలాగే పెంజర్ల, జేపీ దర్గా, తిమ్మాపూర్ జంక్షన్ల వద్ద కూడా ఇదే పరిస్థితి. వై జంక్షన్‌లో ప్రమాదాలను నివారించేందుకు సమీపంలో ఏర్పాటు చేసిన అండర్ పాస్ ఆదిలోనే హంసపాదుగా నిలిచింది. అటు వై జంక్షన్, ఇటు అండర్‌పాస్ మండల ప్రజలకు శాపంగా మారాయి. 44వ నెంబర్ జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ సమయంలో సంబంధిత శాఖ అధికారుల చేసిన పొరపాటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రహదారి విస్తరణ సమయంలో గ్రామాల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించి ఉంటే ప్రమాదాలు జరిగి ఉండేవి కావని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వై జంక్షన్‌లో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఎందరి ప్రాణాలో గాల్లో కలిసి పోతున్నాయని కొత్తూర్‌వాసులు గతంలో ఆందోళనలు చేపట్టారు. ఇందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందిస్తూ వై జంక్షన్ సమీపంలో అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా రూ. 17కోట్ల రుపాయలను మంజూరు చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం అండర్‌పాస్ నిర్మాణం ప్రారంభమై గత సంవత్సరంలో పూర్తయింది. ఇటీవల వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అయితే, అండర్ పాస్ నిర్మాణం డిజైన్ లోపం కారణంగా వర్షాకాలంలో అండర్‌పాస్ వర్షపు నీటితో మునిగి పోతుండడంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి.

జంక్షన్‌లో ప్రమాదాలు ఇలా..

ప్రమాదకరమైన వై జంక్షన్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మండల కేంద్రానికి అతి సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారి ఉండడంతో వాహనాల రద్దీ భారీగా ఉంటుంది. అలాగే కొత్తూర్ సమీపంలో పారిశ్రామిక ప్రాంతం కావడంతో భారీ వాహనాలు పెద్ద ఎత్తున వచ్చి వెళ్తుంటాయి. హైదరాబాద్ నుంచి కొత్తూర్‌తో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలతో పాటు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని ప్రాంతాలు, కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్లే వాహనచోదకులు కొత్తూర్ వైజంక్షన్‌ను క్రాస్ చేసి వెళ్లాల్సి ఉంటుంది. 44వ జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు, జంక్షన్ క్రాస్ చేస్తున్న వాహనాలు ఢీకొంటుడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిరుపయోగంగా అండర్‌పాస్

ప్రమాదాల దృష్ట్యా జంక్షన్ సమీపంలో దాదాపు 17కోట్ల రుపాయలతో నిర్మించిన అండర్‌పాస్ రహదారి నిరుపయోగంగా మారింది. అధికారుల నిర్లక్ష్యమో, డిజైన్ లోపమో కాని అండర్‌పాస్ ప్రజలకు శాపంగా మారింది. వర్షపు నీరు బయటకు పంపేందుకు వేసిన పైపులైన్ వ్యవస్థ ఫెయిల్ అయ్యింది. ఈ లోపాన్ని సరిదిద్దడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. గత సంవత్సరం అండర్‌పాస్ నుంచి రాకపోకలు ప్రారంభమైనా వర్షం నీరు నిండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అండర్‌పాస్ వద్ద వర్షపు నీరు నిలువకుండా సమీపంలో ఇటీవల సంపులను ఏర్పాటు చేశారు. సంపుల నుంచి నీటిని మోటర్ల ద్వారా బయటకు పంపేందుకు సిద్ధం చేశారు. అండర్‌పాస్ వద్ద వర్షపునీరు నిలిచిన సమయంలో విద్యుత్ కోతలు ఉండడంతో మోటర్లు నడువక వర్షపు నీరు అలానే ఉంటుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.



రాకపోకలుంటే ప్రమాదం జరిగేది కాదు

వై జంక్షన్ వద్ద ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పోలీసులు జంక్షన్‌ను బారికేడ్లతో మూసివేసి ఇటీవల అండర్‌పాస్ రహదారి గుండా వాహనాల రాకపోకలు కొనసాగించారు. ఇటీవల వర్షాలు కురవడంతో అండర్‌పాస్‌లోకి వర్షపు నీరు చేరడంతో అటుగా వచ్చిన కారు నీట మునిగింది. స్థానికులు స్పందించకపోతే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న స్థానిక పోలీసులు వై జంక్షన్‌ను తిరిగి పునరుద్ధరించారు. దాంతో జంక్షన్ వద్ద శుక్రవారం మూడు వాహనాలు ఢీ కొనడంతో ఒకరు దుర్మరణం చెందారు.

ఆరు నెలల్లో 10మంది మృతి

వై జంక్షన్, పెంజర్ల జంక్షన్, జేపీ దర్గా జంక్షన్, తిమ్మాపూర్ జంక్షన్‌ల వద్ద ఆరు నెలల్లో ప్రమాదాలు జరిగి 10మంది దాకా మృత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులుగా మారారు. అత్యధికంగా వై జంక్షన్ వద్ద ప్రమాదాలు జరిగాయి.

ప్రాణలను అరచేతిలో పెట్టుకుని దాటుతున్నాం



ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వైజంక్షన్‌ను దాటుతున్నాం. తరుచూ ప్రమాదాలు భయాందోళనను కలిగిస్తున్నాయి. రాత్రి సమయాల్లో బిక్కుబిక్కుమంటూ ముందుకు సాగుతున్నాం. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి గుండా వచ్చే వాహనాల స్పీడ్‌ను నియంత్రించాలి.

- మేకల రాఘవేందర్ యాదవ్, కొత్తూర్

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



44వ జాతీయ రహదారిపై ఉన్న జంక్షన్ల వద్ద ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తూర్ వై జంక్షన్‌ను ప్రస్తుతం బారికేడ్లతో మూసివేశాం. హైదరాబాద్ నుంచి కొత్తూర్ వైపు వచ్చే వాహనచోదకులు అండర్‌పాస్ గుండా రావాలి. వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వాహనాల స్పీడ్ నియంత్రించేందుకు జంక్షన్ల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నాం. ట్రాఫిక్ స్తంభించకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

- చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ, షాద్‌నగర్

ఫ్లై ఓవర్ నిర్మాణాల కోసం కృషి చేస్తా



ఇటీవల వర్షపు నీటితో నిండిన అండర్ పాస్‌ను పరిశీలించా. హైదరాబాద్‌లో ఉన్న ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమావేశమై చర్చించాను. కొత్తూర్ వై జంక్షన్, పెంజర్ల జంక్షన్, జేపీ దర్గా జంక్షన్లు కలుపుకుని ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులకు వినతిపత్రం అందజేశాను. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. జంక్షన్‌ల వద్ద ప్రమాదాలు జరుగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

కొందుర్గు, జూలై 13: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని రాంచంద్రాపూర్‌లో సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, అందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరుచేసి, నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా.. ఇళ్లు మంజూరు చేయలేదని, గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలు అంటూ కొన్ని చోట్ల మాత్రమే ఇళ్లు నిర్మించిందని, లబ్ధిదారులకు అందజేయలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలకు మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఏనెగడ్డలో 2007లో 74 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని, ప్రస్తుత ప్రభుత్వం స్థలాల లబ్ధిదారులకు అక్కడే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, నిర్మాణాలు చేయించాలని కోరారు. అనంతరం కొందుర్గు మండల నూతన కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యదర్శిగా బి.నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా జి.యాదయ్య, సి.సురేష్, భూపాల్, బందెమ్మ, పి.యాదమ్మ, బాలకృష్ణయ్యలను ఎన్నిక చేసినట్లు జంగయ్య వివరించారు. కార్యక్రమంలో జి.వెంకటేష్, ఎం.కృష్ణ, చిల్కమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి
- దోమ పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

దోమ, జూలై 13: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం దోమ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌తో కలిసి ఎస్పీ నారాయణ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలు, క్వార్టర్స్ భవనం, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు, కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉన్న ప్రతీ పోలీసు అధికారి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వారి నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసి ఫాలోఅప్ చేయాలని ఆయన సూచించారు. ప్రతీ ఫిర్యాదుదారుడికి సత్వర న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100కు కాల్ చేసిన వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిఘా పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘాతో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేసి పూల మొక్కలతో ఆహ్వానించారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగించాలి

నూతన చట్టాలపై ప్రజలకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. ప్రతీఒక్కరూ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగితే గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉండవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఆనంద్‌కుమార్, ఏఎస్సై సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు నర్సింలు, భీమ్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కానిస్టేబుళ్లు పురుషోత్తం, నరేశ్, నారాయణరెడ్డి, మాధవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదగాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జూలై 13 : చదువు పూర్తి చేసుకుని పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధికి పాటుపడాలని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ స్నాతకోత్సవం, ఎంఆర్‌ఈసీలో నిర్వహించిన 19వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకల్లో మల్లారెడ్డి పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ చదువు పూర్తిచేసి ఉద్యోగాలకు పరిమితం కాకుండా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి మంచి స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడేలా సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ఇంజినీర్లు, వ్యవసాయ రంగంలో ఆగ్రికల్చర్ విద్యార్థులు సేవలందించి గుర్తింపు పొందాలన్నారు. తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు మంచి ప్లేస్‌మేట్స్ లభిస్తున్నాయన్నారు. చాలామంది విదేశాలకు వెళ్లి మంచి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని అన్నారు. ఇంతటితో చదువును ఆపకుండా ఉన్నత చదువులు చదివేందుకు ప్రయత్నించాలని కోరారు. అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. సమాజంలో అందరికీ అన్నం పెట్టే రంగంలో పనిచేసే అవకాశం లభిస్తుందన్నారు. బీఎస్సీ పూర్తిచేసుకున్న విద్యార్థులు గ్రూప్ పరీక్షలు రాసి ప్రజలకు సేవచేసే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో మాస్టర్స్ చదివే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రపంచంలో ఎక్కడికు వెళ్లినా మంచిస్థాయిలో స్థిరపడుతారన్నారు. తమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు గొప్పస్థాయిలో స్థిరపడి మంచి పేరును సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ డీన్ రాజారెడ్డి, ఎంఆర్‌ఈసీ డీన్, కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ విద్యార్థినికి పట్టా అందజేస్తున్న డీన్ రాజారెడ్డి



మట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

- విద్యార్థులకు ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యతిరాజులు సూచన
- సింబియాసిస్ యూనివర్సిటీలో ఇండక్షన్ ఫెస్టివల్

నందిగామ, జూలై 13: విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.యతిరాజులు అన్నారు. నందిగామ మండల పరిధిలోని మొదళ్ళగూడ శివారులో గల సింబియాసిస్ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఫ్రెషర్స్‌కు వారం రోజులపాటు నిర్వహించిన ఇండక్షన్ ఫెస్టివల్ కార్యక్రమం శనివారం ముగిసింది. కళాశాల డైరెక్టర్స్‌తో కలిసి మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.యతిరాజులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 5 ఏళ్ల న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని సమర్థవంతగా అమలు చేయవలసిన ఆవశ్యకతను వివరించారు. క్రమశిక్షణతో మెలగాలని, గురువులను గౌరవిస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థలో వస్తున్న మార్పులను నిరంతరం చర్చించాలని సూచించారు. మారుతున్న సామాజిక అవసరాల నిమిత్తం మతం, సంఘం, సంస్కృతుల్లో మార్పులు అనివార్యమని, వాటిని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా జి.యతిరాజులును కళాశాల డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంతోష్ అగావ్, అధ్యాపకులు అనురాధ, శ్రీనివాస్, శాంతి, అనిత సబ్లె, శాంసన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యతిరాజులును సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ సంతోష్ అగావ్

హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా అనంతసేన్‌రెడ్డి

వికారాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాకు చెందిన ఆకుల అనంతసేన్‌రెడ్డిని హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మర్పల్లి మండలం, ఖిల్కోడ గ్రామానికి చెందిన అనంతసేన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేయగా, అదే కోర్టులో సుదీర్ఘకాలం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గత రెండు పర్యాయాలుగా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్న అనంతసేన్‌రెడ్డి క్రమశిక్షణా సంఘం ఛైర్మన్‌గా, తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి సంఘం కోశాధికారిగా సేవలు అందిస్తున్నారు. అంతే కాకుండా అనంతసేన్‌రెడ్డి రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ (బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్) సభ్యులుగా, ఎస్ఏపీ కళాశాల నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించే వికాస్ మండలి సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్నారు. హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. అనంతసేన్‌రెడ్డి తండ్రి ఆకుల లాల్ రెడ్డి కూడా ప్రముఖ న్యాయవాదిగా రాణించారు. అంతే కాకుండా ఆయన పంచాయతి సమితి అధ్యక్షుడిగా, వికాస మండలి కార్యదర్శిగా విశిష్ట సేవలు అందించారు. హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన అనంతసేన్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్ కుమార్ అభినందించారు.



అనంతసేన్‌రెడ్డి

జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా శ్రీనివాస్‌రావు



శ్రీనివాసరావు

ఇదిలా ఉంటే, వికారాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా స్థానిక న్యాయవాది శ్రీనివాసరావు నియమితులయ్యారు. జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. జిల్లా అదనపు జడ్జి కోర్టుతో పాటు సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో కూడా ప్రభుత్వ ప్లీడర్‌గా ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

దురదృష్టం.. దూసుకొచ్చిన మృత్యువు

- కొత్తూర్ వై జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో లారీకింద పడి ప్రాణాలు కోల్పోయిన రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

కొత్తూర్, జూలై 13: ప్రభుత్వం ఇచ్చిన అర ఎకర పొలంలో చాలీచాలని వ్యవసాయం.. మరోపక్క డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న ఆ వ్యక్తిని దురదృష్టం వెంటాడింది. మృత్యువు రూపంలో దూసుకొచ్చిన లారీ ఆ రైతు ప్రాణాన్ని బలిగొన్న తీరు కుటుంబసభ్యులతో పాటు పలువురిని కంటతడి పెట్టించింది. మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారిపై వై జంక్షన్ వద్ద శుక్రవారం ఓ లారీ డీసీఎంతో పాటు మరో లారీని ఢీకొన్న ఘటనలో అంజయ్య(50) అనే వ్యక్తి దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన అంజయ్య.. ప్రభుత్వం ఇచ్చిన అర ఎకర పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం మీద వచ్చే అదాయం సరిపోకపోవడంతో, ప్రైవేట్‌గా డ్రైవర్ చేరాడు. ఈ క్రమంలో అతడు శుక్రవారం విధులు ముగించుకొని స్కూటీపై స్వగ్రామానికి వస్తుండగా.. దినేష్ అనే యువకుడు లిఫ్ట్ అడగడంతో ఇద్దరూ కలిసి వస్తున్నారు. ఇంతలో షాద్‌నగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపుల లోడ్‌తో వెళ్తున్న భారీ ట్రైలర్ లారీ ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొంది. ఆ తర్వాత కుడి వైపుకు వెళ్లి హైదరాబాద్ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీని ఎదురుగా వెళ్లి ఢీకొనడంతో బోల్తాపడింది. అయితే, అదే సమయంలో లారీ పక్క నుంచి వెళ్తున్న అంజయ్య స్కూటీపై లారీ పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అంజయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



అంజయ్య(ఫైల్)

సాగునీటి సంఘాలకు ఎన్నికలెప్పుడో?

- చివరిసారిగా 2006లో నిర్వహణ
- పట్టించుకోని ప్రభుత్వ యత్రాంగం
- అధ్వానంగా మారుతున్న నోటిఫైడ్ చెరువులు



ఇప్పాయిపల్లి కొత్త చెరువు, మరమ్మతుకు నోచుకోని తూము(ఇన్‌సెట్లో)

కులకచర్ల, జూలై 13: రాష్ట్రంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు గత పదహారేళ్లుగా నిర్వహించడం లేదు. దాంతో చెరువులు అధ్వానంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా వాటిపై ఆజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతులపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. చెరువుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం తదితర పర్యవేక్షణ పనులు నీటి సంఘాలు, పాలకవర్గాలు చేపట్టేవి. పదహారేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది.

సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఇలా..

గతంలో ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేయగానే 100 ఎకరాలు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టుకు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకొని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. 16 ఏళ్ల నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పని చేయక, సాగునీరు రాక నిరుపయోగంగా మారాయి.

2008 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికల్లేవు

కులకచర్ల ఉమ్మడి మండలంలో వందల ఎకరాలు ఆయకట్టు.. అంతకంటే ఎక్కువగా ఉన్న చెరువులు 10 ఉన్నాయి. కులకచర్ల మైలమ్మ చెరువు, కామునిపల్లి కాముని చెరువు, ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు, అల్లాపూర్ చెరువు, కొత్తపల్లి చెరువు, మరికల్ మల్కాచెరువు, చాకల్‌పల్లి చెరువు, చెల్లాపూర్ చెరువులు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండటంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివృద్ధి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సంఘాలపై దృష్టి సారించాలి.

- ఆనంద్, రైతు, ఇప్పాయిపల్లి

ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆదేశాలు లేవు



ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం. ప్రభుత్వం నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా నిర్వహిస్తాం. ప్రస్తుతం ఈ విషయంలో ప్రభుత్వ ఆదేశాలు అంతిమ తీర్పు.

- మురళీధర్, కులకచర్ల తహసీల్దార్

అస్తవ్యస్తం.. 'ప్రత్యేక పాలన'

- అధికారుల అలసత్వంతో తాగునీటి కటకట
- బోరు మోటార్లు పాడైనా పట్టించుకోని వైనం
- సక్రమంగా లేని మిషన్ భగీరథ నీటి సరఫరా

పెద్దేముల్, జూలై 13 : ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చే బోర్లు పాడైనా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీరు రానిరోజు డైరెక్ట్ పంపింగ్‌ల వద్ద మహిళలు యుద్ధమే చేయాల్సి వస్తోంది. పెద్దేముల్ మండలంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన అనంతరం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించినా.. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు గ్రామ పర్యటనలే చేయడం లేదు. అప్పుడప్పుడూ చుట్టుపుచూపుగా వచ్చిపోతున్నారు. సమస్యలు ప్రస్తావన రాగానే పంచాయతీలో నిధులు లేవని చేతులెత్తేస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని రుక్మాపూర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉంది. దానికి నీటిని సరఫరా చేసే బోరు కూడా ఉంది. అయితే, రెండు నెలలుగా బోరుమోటార్ పనిచేయడం లేదు. మిషన్ భగీరథ నీరు వస్తే తాగునీటికి ఇబ్బందులేమీ ఉండవు. కానీ, ఈ మధ్య నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. బోరు మోటార్ కాలిపోవడంతో రెండు నెలలుగా పట్టించుకోవడం లేదు. అదేవిధంగా మంబాపూర్ గ్రామంలో కూడా రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. జనం తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డైరెక్ట్ పంపింగ్‌ల వద్ద నీటికోసం యుద్ధమే చేయాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. ప్రత్యేకాధికారులు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



రుక్మాపూర్ గ్రామంలోని ఓవర్ హెడ్‌ట్యాంక్, మరమ్మతుకు నోచుకోని బోరు మోటార్(ఇన్‌సెట్లో)

సనాతన ధర్మ స్థాపనకు 'సైకిల్ యాత్ర'

- ఢిల్లీకి చెందిన రాజేందర్ శర్మ సంకల్పం
- అయోధ్య రామ మందిరం నుంచి ఏడు రాష్ట్రాలు దాటి తెలంగాణలోకి..
- 50వేల కిలోమీటర్ల యాత్రకు శ్రీకారం
- తాండూరు చేరిన సైకిల్ యాత్ర



తాండూరు, జూలై 12: హిందూ ధర్మ పరి రక్షణ కోసం ఓ యువకుడు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈక్రమంలో శనివారం ఆ యువకుడి సైకిల్‌యాత్ర తాండూరుకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీకి చెందిన రాజేందర్ శర్మ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరం నుంచి సైకిల్‌పై సంపూర్ణ భారత్ యాత్రకు శ్రీకారం చుట్టారు. మార్చి 13న ఆయన ప్రారంభించిన ఈ యాత్ర ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను దాటుకుంటూ తెలంగాణలోకి ప్రవేశించింది. కాగా, 50వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రను చేపట్టిన శర్మ 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, 51 శక్తి పీఠాలు, చార్‌ధామ్, పంచకేదార్, తదితర పుణ్యక్షేత్రాలు పర్యటించి స్వగ్రామం చేరుకుంటారని తెలిపారు. అయితే, యాత్రలో భాగంగా సనాతన ధర్మంపై ప్రచారం చేస్తూ రాత్రివేళ దేవాలయాల వద్ద విశ్రాంతి తీసుకుంటానని, ప్రతీ రోజు 70-80 కిలో మీటర్లు సైకిల్‌పై యాత్ర కొనసాగిస్తున్నట్లు శర్మ మీడియాకు వెల్లడించారు. ఈమేరకు తాండూరులో ఆ యువకుడిని పలువురు నాయకులు, స్థానిక ప్రజలు అభినందించారు. ఆయన ఇప్పటివరకు 8వేల కిలోమీటర్ల యాత్ర పూర్తిచేసినట్లు చెప్పారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూలై 13 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం నగరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించినట్లు ఎమ్మెల్యే యాదయ్య పేర్కొన్నారు.

20వేల మొక్కలు నాటడమే లక్ష్యం

- తలకొండపల్లి ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్
- చుక్కాపూర్ గ్రామంలో వనహోత్సవం
- స్థానికులతో కలిసి 300 ఈతమొక్కలు నాటిన సీఐ



చుక్కాపూర్‌లో నిర్వహించిన వనమహోత్సవంలో సీఐ బద్యనాథ్ చౌహాన్, సిబ్బంది, స్థానికులు

తలకొండపల్లి, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 20 వేల ఈత, తాటి, కర్జూర మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. వవనహోత్సవం కార్యక్రమంలో ప్రజలంతా పలు పంచుకోవాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వనహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక జంగారెడ్డి వ్యవసాయ పొలంలో సుమారు 300 ఈత మొక్కలను స్థానికులు, ఎక్సైజ్ సిబ్బంది తో కలిసి నాటారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొక్కల పెంపకం ప్రాధాన్యతను ప్రజలంతా గుర్తెరిగి మసులుకోవాలని ఆయన సూచించారు. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. నాటు సారా నిరోధానికి ఎక్సైజ్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు అరుణ్‌కుమార్, స్వప్న, సిబ్బంది నర్సింహ, బాబు, ప్రవీణ్‌రెడ్డి, ఆమని తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లపై 'పోలీసు పెట్రోలింగ్'

ఆదిభట్ల, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీసులకు అందించిన సైకిళ్లపై పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు శనివారం ఆదిభట్ల ఎస్సైలు బాల్‌రాజు, రాజులు మహిళా కానిస్టేబుళ్లు సైకిళ్లపైనే వెళ్లి సాధారణ ప్రజలతో తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు స్థానికులతో మాట్లాడారు. పోలీసులకు సహకరించాలని వారికి సూచించారు.



పెట్రోలింగ్‌లో భాగంగా విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

శంకర్‌పల్లి, జూలై13 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. శంకర్‌పల్లిలోని ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రైవేట్ ల్యాబ్/డయాగ్నస్టిక్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఆసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ పరీక్షను ఎలిషా టెస్టు ద్వారానే వ్యాధి నిర్ధారణ చేసి ప్రభుత్వ వైద్యురాలికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల వివరాలతో పాటుగా దీర్ఘకాలిక రోగుల వివరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారికి ఇవ్వాలని తెలిపారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని, అర్హతకు మించి వైద్యం చేయొద్దని హెచ్చరించారు. కాచి వడబోసిన నీటినే తాగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు రేవతి, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, వైద్యసిబ్బంది మన్సూర్ అలీ, సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు

సమాయత్తం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 13: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో శనివారం ఎమ్మెల్యే, వంశీచంద్ పర్యటించారు. గుండాలలోని అంబా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నూతన చైర్మన్ మల్లెపల్లి సందీప్‌రెడ్డి, సభ్యులను శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. నేతలు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగేనన్నారు. బీఆర్ఎస్‌కు మనుగడ లేదని గ్రహించే ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, ఆ పార్టీ ఖాళీ కావడం ఖాయమన్నారు. పార్టీ బలపడితేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ పదవులు కైవసం చేసుకుంటామన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలొస్తామని కసిరెడ్డి, వంశీచంద్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని నామినేటెడ్ పదవులను ప్రభుత్వం భర్తీ చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేకే విపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టు ఆగస్టు 15నాటికి పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామన్నారు. ఆలయాల అభివృద్ధి, భక్తుల సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, సంజీవకుమార్, పర్వతరెడ్డి, మోతీలాల్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, బిచ్యానాయక్, గోరటి శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణనాయక్, ఫరీద్, మానయ్య, మోహన్‌రెడ్డి, నాజర్, శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేద్దాం'

శంషాబాద్ రూరల్, జూలై 13: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభివృద్ధి కృషిచేద్దామని శంషాబాద్ మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్ అన్నారు. శనివారం పెద్దతూప్రలో విలేకరులతో మాట్లాడుతూ... కొందరు నాయకులు పార్టీ వీడినంత మాత్రన పార్టీకి నష్టమేమీ లేదన్నారు. కొత్త నాయకులను తయాలరు చేసుకుందామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా తాము కేసీఆర్ వెంటే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. స్వార్థం కోసం పార్టీలు మారే నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెల్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఏపీలో టీడీపీ పని అయిపోయిందని కొందరన్నారని, మొన్నటి ఎన్నిల్లో ఆ పార్టీ అఖండ మోజార్టీతో గెలిచిందన్నారు. అలాగే తెలంగాణలోనూ బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో గెలవడం తథ్యం అన్నారు. త్వరలోనే మండలంలో పర్యటించి నాయకులను, కార్యకర్తలను కలుస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పట్నం' స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం, జూలై 13: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఇషా హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు తక్కువ ధరల్లో వైద్య సేవలందించాలని సీఐ సత్యనారాయణ హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి ఆర్థికంగా చేయూత


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 13: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థిక చేయూతనిస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్లలోని క్యాంప్ కార్యాలయంలో ఐదు మండలాలకు కలిపి 80మంది లబ్ధిదారులకుగాను రూ.26.97లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదపలో ఉన్న పేదలను సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్లకు బీటీ రోడ్లువేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. త్వరలోనే రోడ్ల పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ డి.వెంకటరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండలాల పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి,చంద్రశేఖర్, నాయకులు శివప్రసాద్, చంద్రయ్య, రాములు, స్వామి, పాండుయాదవ్,రాములు, వెంకటేశ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, దేవుని ఎర్రవల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రాములు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరం కలిసి పార్టీ, నియోజకవర్గ అభివృద్ధికి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కొత్తగూడ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, గ్రామస్తులు

కందుకూరు,జూలై 13: కొత్తగూడ గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఏఎంసీ మాజీ డైరక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం గ్రామస్తులతో కలిసి నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వినతి పత్రమిచ్చారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కొత్తగూడలో రోజురోజుకూ నూతన భవనాల నిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు గాను ప్రజల సౌకర్యం కోసం నూతన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతనవిద్యుత్ లైన్లకు నిధులు కేటాయించాలని సబితారెడ్డిని కోరినట్లు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. కొత్తగూడలో ఉన్న మినీ స్టేడియ అసంపూర్తి పనులను పూర్తిచేయాలని కోరినట్టు చెప్పారు. తమ వినతులపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బొక్క సత్యనారాయణరెడ్డి, నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షత్‌రెడ్డి, బొక్క శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహా దానం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, జూలై 13: ప్రజల ఆకలి బాధను తీర్చే అన్నదానమే దానాల్లో కెల్లా గొప్పదని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్‌కు ముఖద్వారంగా వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికొచ్చే భక్తులకు శనివారం జర్నలిస్టు ఖాజాపాషా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బక్కని నర్సింహులు ప్రారంభించారు. అన్నదానం చేసిన ఖాజాపాషాను ఆయన అభినందించారు. సమాజ శ్రేయస్సుకు సంపాదనలో కొంత దాన ధర్మాలకు వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందన


శివసేనారెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు, జూలై 13: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన శివసేనారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం శివసేనారెడ్డిని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు కసిరెడ్డి, రాజేశ్‌రెడ్డిలు కలిసి సత్కరించారు. నియోజకవర్గాల్లో క్రీడల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు.

శివసేనారెడ్డికి ఘన సన్మానం

షాద్‌నగర్ అర్బన్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. చైర్మన్‌గా శివసేనారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో యువజన నాయకులు తరలివెళ్లారు.

సీఐకి కాంగ్రెస్ నాయకుల సన్మానం


సీఐని నాగరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మాడ్గుల, జూలై 13 : మాడ్గుల పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన సీఐ నాగరాజు గౌడ్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతా సత్కరించారు. మండలంలో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా చూడాలని సీఐని మాజీ ఎంపీపీ జంగయ్య కోరారు. సీఐని సత్కరించిన వారిలో మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, నాయకులు జడల అంజయ్య, నిరంజన్‌గౌడ్ ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, జూలై 13 : గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ వైస్‌ఎంపీపీ కర్నె శివప్రసాద్ అన్నారు. శనివారం ఊరేళ్ల, మొండివాగు గ్రామాల్లో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాల్లో వైద్యం, మందులు అందజేస్తారన్నారు. వైద్యం ఖర్చుతో కూడుకున్న ఈ రోజుల్లో ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జహంగిర్, విఠలయ్య, ప్రభు, కుమార్, రఫీక్ తదితరులు ఉన్నారు.

'అంతారం పరిధిలోని మైనింగ్‌ను రద్దు చేయాలి'

చేవెళ్ల, జూలై 13 : అంతారం గ్రామ పరిధిలో మైనింగ్‌ను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేందర్ అన్నారు. మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. 15ఏళ్లుగా మైనింగ్ కొనసాగుతున్నా ఇంకా అనుమతిస్తే పర్యావరణానికి చేటుచేస్తుందన్నారు. కాలుష్యతో స్థానికులకు వ్యాధులు వస్తాయన్నారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం అనుమతిస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జైపాల్, శ్రీకాంత్ ఉన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యవర్గం


ప్రమాణం చేస్తున్న సంఘం నూతన నాయకులు

చేవెళ్ల, జూలై 13: జిల్లాలోని 7నియోజకవర్గాల పరిధి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవరాన్ని శనివారం చేవెళ్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవరావు, ప్రధానకార్యదర్శి సృజన్‌కుమార్, కోశాధికారి మోహన్‌రావు, ఉపాధ్యక్షులు విరాట్‌స్వరూప్, కిషన్‌రాల్, అనిల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా రవిశర్మ, సుబ్రహ్మణ్యం, పవన్ కుమార్‌శర్మ, ఆనంద్‌శర్మ ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా స్వప్న సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శి నవీన్‌కుమార్‌ను యునానిమైస్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జానకిరామలాల్, రిటైర్డ్ జడ్జి రామలాల్, రిటైర్డ్ తహసీల్దార్, రఘువీర్‌పండిత్, శ్రీధర్‌లాల్, ఏడు నియోజకవర్గాల బ్రాహ్మణులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనం ప్రారంభించాలని బీఆర్ఎస్ నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్, జీఎల్ఎన్.రెడ్డి తదితరులు

కడ్తాల్, జూలై 13:స్కూళ్లు తెరిచి నెల గడిచినా కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని ప్రారంభించడం లేదని బీఆర్ఎస్ నాయకులు శనివారం కడ్తాలలో నిరసన చేపట్టారు.ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీరును నిరసిస్తూ కేజీబీవీ వద్ద మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు. ఈ నెల 17న కేజీబీవీ భవనాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారని బీఆర్ఎస్ నేతల నిరశన దీక్షకు పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో దశరథ్ నివాసం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ఎంఈవో కార్యాలయం వైపు వెళ్తుండగా సీఐ శివ ప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ అడ్డుకున్నారు దీంతో నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రమిచ్చి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3.5కోట్లతో భవనాన్ని నిర్మించినా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రారంభించకుండా బాలికలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, దశరథ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్ విమర్శించారు. ఈ నెల 17న భవనాన్ని ప్రారంభించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు లాయక్‌అలీ, గోపాల్, ప్రియరమేశ్, సువాలిపంతు, యాదయ్య, సాయిలు, దేవ, నర్సింహ, రమణ, వెంకటేశ్, సురేశ్, కోట్యా, శ్రీను పాల్గొన్నారు.

శంషాబాద్ ఏబీవీపీ అధ్యక్షుడిగా సాయిబాబ

శంషాబాద్, జూలై 13:అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ)శంషాబాద్ అధ్యక్షుడిగా డి.సాయిబాబ, కార్యదర్శి చరణ్‌దీప్ ఎన్నికైనట్టు సంఘం నాయకులు శనివారం తెలిపారు. సంయుక్త కార్యదర్శులుగా నవీన్, శివ, జ్యోతి, మేఘన, ఉపాధ్యక్షులుగా విజయ్, చరణ్, భరత్, భార్గవ్, అనూష నియమితులయ్యారన్నారు.

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- 17న కేజీబీవీ భవనం ప్రారంభం
- మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ, ఎమ్మెల్యేల రాక


విలేకరులతో మాట్లాడుతున్న నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కడ్తాలలో ఈ నెల 17న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, నాగర్‌కర్నూల్ ఎంపీ ఎం.రవి, ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డిల పర్యటన నేపథ్యంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నేతల పర్యటనపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. కడ్తాలలో రూ.3.5కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు తరలిరావాలని వారు కోరారు. పేద విద్యార్థుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కడ్తాల ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థలపరిశీలన చేస్తున్నట్టు, జూనియర్ కాలేజీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు జి.భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చందోజీ, లక్ష్మయ్య, లక్పతి, జవహర్‌లాల్, నరేందర్, హీరాసింగ్, షాబుద్దీన్, నరేశ్, బాల్‌రాజ్, లక్ష్మణ్, రామకృష్ణ, జహంగీర్‌అలీ, రాంచందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఆదిభట్ల, జూలై 13:విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి సూచించారు.నాదర్‌గుల్ విజ్ఞాన్ హైస్కూలులో శనివారం సైబర్ క్రైమ్, డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఆన్‌లైన్, సైబర్ నేరాలపై వివరించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు.అవసరం మేరకే సెల్‌ఫోన్ వాడాలని, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. అపరిచితులు పంపిన లింక్‌లను ఓపెన్ చేయొద్దని చెప్పారు. సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి చెప్పాలన్నారు. విద్యార్థినులు ఎదుటి వ్యక్తులు తీసుకునే చనువు పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాడ్ టచ్ చేస్తే వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలని, అలా ప్రవర్తించే వారికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిభట్ల ఎస్సై వెంకటేష్, విజ్ఞాన్ హైస్కూల్ చైర్మన్, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు 'గోలి' పరామర్శ

ఆమనగల్లు, జూలై 13: ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో శనివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. రాంనుంతల, చెర్కూర్ గ్రామాల్లో అనారోగ్యంతో మృతిచెందిన గొడుగు చంద్రయ్య, కేస్లి కుటుంబాలను ఆయన పరామర్శించారు. చంద్రయ్య కుటుంబానికి రూ.10వేలు సాయం అందజేశారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో పత్యనాయక్,చంద్రశేఖర్‌రెడ్డి, పంతూనాయక్, భీమయ్యగౌడ్, సతీష్, నాగులు, మైసయ్య, శ్రీను, భీమరాజు, లాలయ్య, సుమన్, వెంకటేశ్, రమేశ్, శ్రీన, రమేశ్, శివ, రూపం వెంకట్‌రెడ్డి, రాఘవేందర్, మాజీ ఎంపీటీసీ సరిత తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

శంషాబాద్, జూలై 13 : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషిచేస్తోందని పోలీ సు అధికారులు అన్నారు. డాగ్‌స్వాడ్‌తో మునిసిపల్ పరిధిలో శనివారం రాత్రి అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ కేఎస్ రావు అధ్వర్యంలో బస్‌స్టాండ్ పరిసరాలు, లాడ్జ్‌లు, హోటళ్లు, పాన్‌షాపులు, హాస్టళ్లలో తనిఖీలు చేశారు. గ్రడ్స్ సరఫరా చేస్తున్నారనే అనుమానంతో తనిఖీలు చేశారు. తనిఖీల్లో స్థానిక నార్కొటిక్ విభాగ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ... సమాజంతో యవత డ్రగ్స్ కు బానిసలవుతున్నారని, అందుకే తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ సరఫరా చేసినా, కొన్నా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ అమ్మితే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఈ తనిఖీలు నిరంతరంగా నిర్వహిస్తామని చెప్పారు. హోటళ్లలో డ్రగ్స్ పట్టుబడితే యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ బాల్‌రాజ్, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.



బస్‌స్టాండ్‌లో పోలీసుల తనిఖీలు

ఇళ్ల నిర్మాణానికి 'ఉప్పల' చేయూత

తలకొండపల్లి, జూలై 13: మండల కేంద్రానికిచెందిన గుండెమోని బాలయ్య ఇంటి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనిచ్చారు. ఇంటి నిర్మాణం కోసం వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెటీరియల్‌ను శనివారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు కోటేశ్వర్, రవికుమార్, నర్సింహ్మా, రాజు, బుచ్చిబాబు, తదితరులు ఉన్నారు.

మాడ్గుల: నర్సంపల్లిలో పోలె కాశయ్య, కూన అంజయ్య ఇటీవల చనిపోయారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తరఫున మాజీ సర్పంచ్ హనుమానాయక్ బాధిత కుటుంబాలకు పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3వేలు అందజేశారు.

అసంపూర్తి భవనంలో తరగతుల నిర్వహణ


అసంపూర్తి భవనం వద్ద కాంట్రాక్టర్

ఆదిభట్ల, జూలై 13 : ఆదిభట్ల పరిధి మన్నెగూడలో నిర్మాణం పూర్తికాకుండానే భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే తాము బాధ్యత వహించం అని కాంట్రాక్టర్ వింటేజ్ ప్రాజెక్ట్ సంస్థ ప్రతినిధులు శనివారం తెలిపారు. వింటేజ్ మేనేజింగ్ పార్ట్‌నర్ మహ్మద్ తాహెర్ మాట్లాడుతూ.. మన్నెగూడలో స్కూల్ భవనం నిర్మాణానికి ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నామన్నారు. వారు డబ్బు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశామన్నారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, డ్రైనేజీ తదితర పనులు చేయాల్సి ఉందన్నారు. నిర్మాణం పూర్తి కాకుండానే ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాం తరగతులు నిర్వహిస్తోందని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఈ భవనంలో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే తమ సంస్థ బాధ్యత వహించదని అన్నారు.

'కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం'

కడ్తాల్, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం, వృత్తి రక్షణకు పెద్దపీట వేస్తుందని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్, జిల్లా నాయకుడు పాలకూర్ల రాములు అన్నారు. కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కే క్రమంలో కార్మికులు ప్రమాదాల బారినపడకుండా ప్రభుత్వం లైఫ్‌సేవ్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుడుతుండడం అభినందనీయమని పేర్కొన్నారు. కడ్తాలలో శనివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ.. గీత కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల కిట్లను అందించడానికి ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్ గూడలో ఆదివారం ఉదయం 11గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం కల్లు గీత కార్మికులతో కలిసి సీఎం సహపంక్తి భోజనం చేస్తారని తెలిపారు. కల్లు గీస్తున్న క్రమంలో దశాబ్దాలుగా ఎంతో మంది గీత కార్మికులు ప్రమాదాల బారిన పడుతుండడంతో వారి రక్షణను దృష్టిలో ఉంచుకొని సీఎం లైఫ్‌సేవ్ కిట్లు ఇస్తుండడం కార్మికుల సంక్షేమం పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమానికి గీత కార్మికులు, గౌడ కులస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మల్లేశ్‌గౌడ్, రాములు కోరారు. సమావేశంలో యాదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

19 నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జూలై 13: పేదల నేత్ర సంరక్షణను దృష్టిలో ఉంచుకొని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలకు చెన్నై శంకర నేత్రాయల కంటి వైద్యశాఖ సహకారంతో వెల్దండ ఏవీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం కంటి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఈడీ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

క్రైం కార్నర్

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన ఆసిఫ్

షాద్‌నగర్ రూరల్ జులై 13: షాద్‌నగర్‌లోని అలకాపురి కాలనీలో నీటి గుంతలో పడి వ్యక్తిమృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన మహ్మద్ ఆసిఫ్(22) లారీ డ్రైవర్‌గా పనిచేసే తన బావతో శుక్రవారంరాత్రి స్క్రాప్ లోడ్‌తో ఎలికట్ట శివారు దేవశ్రీ పరిశ్రమకు వచ్చారు. లారీని పరిశ్రమ వద్ద నిలిపి భోజనం చేద్దా మని షాద్‌నగర్‌కు వె ళ్లారు. ఈ క్రమంలో ఆసిఫ్ మద్యం తాగి ఎటో పోయాడు. అతడి కోసం బావ వెతికినా దొరక్కపోవడంతో డ్రైవర్ పరిశ్రమ వద్దకు పోయాడు. అయితే ఆసిఫ్ అలకాపురి కాలనీ ఇళ్ల మధ్యలో ఉన్న ఓ నీటి గుంతలో పడి మృతిచెందాడు. ఉదయం కాలనీ వాసులు చూసి పోలీసుల సమాచారమిచ్చారు. ఆసిఫ్ బావ కూడా వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

ఎక్స్‌కవేటర్-బైక్ ఢీ.. ఒకరి దుర్మరణం

కొందుర్గు, జూలై, 13: మండల కేంద్రంలో జేసీబీ, మోటర్ సైకిల్ ఢీకొనడంతో, ఒకరు మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లేడ్-చౌదరిగూడ మండలం వనంపల్లికి చెందిన గండె యాదయ్య(28) తన బైక్‌పై షాద్‌నగర్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొందుర్గులోని ఉమ్మెంత్యాలకు వెళ్లే మూల మలపు వద్ద ఎదురుగా వచ్చిన జేసీబీని ఢీకొట్టాడు. దీంతో యాదయ్యకు తలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. యాదయ్యకు భార్య సంతోష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


రమేష్(ఫైల్)

షాబాద్, జూలై 13: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బొబ్బిలిగామకు చెందిన సిద్ధపురం రమేష్(24) కారు కొనుక్కొని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడురోజుల క్రితం ఇంటికొచ్చాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో తాడుతో ఉరేసుకున్నాడు. పొలానికి వెళ్లిన తల్లి లక్ష్మమ్మ వచ్చి చూడగా గడియపెట్టి ఉంది. ఆమె కిటికీలోంచి చూడగా రమేశ్ ఉరేసుకొని ఉన్నాడు. దీంతో తల్లి రోదిస్తూ సమీపంలోని వారిని పిలిచి తలుపులు పగులగొట్టి వెళ్లిచూస్తే అప్పటికే రమేశ్ మృతిచెందాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని పోలీసులు చెప్పారు. రమేశ్ తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృత్యువాత

కొందుర్గు, జూలై13 : విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన పర్వతాపూర్‌లో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డి.శంకరయ్య ఆవు శనివారం మేత మేసుకుంటూ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా వైర్ తగిని కరెంట్ సాక్‌తో మృతిచెందింది. ఆవు విలువ 80వేల వరకు ఉంటుందని, తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని బాధితుడు కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, వైర్లు కిందకి వేలాడుతున్నాయని విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు అన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఆవు